


# ఓ అరవింద కథ

చెల్లూరి సీతారాజేశ్వరరావు

ఆరోజు ఫస్టుతారీఖు. ఆఫీసు అవగానే అరవింద కౌంటర్ దగ్గరికి వెళ్ళి క్యాషియర్ ఇచ్చిన నీలంకవరు అందుకుంది. కవరుమీద పేరు, వుద్యోగం, జీతం, మినహాయింపు టైపుచేసి ఉన్నాయి. అరవింద కవరు తీసి ఎదురుగావున్న బెంచీమీద కూర్చుని డబ్బు లెక్కపెట్టసాగింది. అన్నీ కొత్తనోట్లే. గరగరలాడుతున్నాయి.

"ఇంకా అవలేదూ?" అన్నపూర్ణ వచ్చి భుజం తట్టింది.

డబ్బు బాగ్‌లో పెట్టి అరవింద లేచింది. "నీ పేమెంట్ అయిందా?"

అన్నపూర్ణ తలాడించింది. ఇద్దరూ

కాంపౌండు దాటి బయటికి వచ్చారు. స్టాఫ్‌లో చాలమంది ముఖాలు సంతోషంగా వెలిగిపోతున్నాయి. ఈ ఆనంద మెంతసేపు...క్షణభంగురం....అరవింద నవ్వుకుంది.

బస్‌స్టాప్‌కి వచ్చారు ఇద్దరూ. రోజూలా రద్దీగా లేదు అక్కడ.

"మన సూపర్ బజార్ ప్రోగ్రాం వుందా?" అన్నపూర్ణ అడిగింది.

"అనవాయితీ తప్పించడం ఎందుకు?"

పుష్పక విమానంలా వచ్చింది బస్సు ఎక్కడానికీ దిగడానికీ డార్విన్ సిద్ధాంతం 'స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్' గుర్తుకువచ్చింది. అరవింద ఎలాగో ఎక్కేసింది. ఇంతలో కండక్టర్ బెల్‌కొట్టాడు బస్సు బయలు దేరింది. అన్నపూర్ణ ఎక్కలేకపోయింది.

అన్నపూర్ణ ఎక్కలేకపోయినందుకు వ్యాకులపడింది సూపర్‌బజార్ దగ్గర దిగి లోపలకినడుస్తుంటే అన్నపూర్ణ స్వాగతం చెప్పింది.

"అరె.... నువ్వెలా వచ్చావ్? అరవింద ఆశ్చర్యపోయింది.

"ఆటోలో నీకంటే ముందుగా వచ్చాను."

"డబ్బులున్న రోజులు కదా!"

పదినిమిషాల్లో అరవింద తన పని ముగించుకుంది. అన్నపూర్ణకి చాదస్తం ఎక్కువ. అందుకే గంటకిపైగా ఆలస్యమైంది.

అన్నపూర్ణ ఆటో పిలిచింది.

"ఇప్పుడే వస్తానుండు" సంచీ ఆమెకిచ్చి అరవింద లోపలకెళ్ళింది

అరవింద రాగానే ఆటో బయలు దేరింది "మళ్ళీ వెళ్లావేం."

"మావారికి బ్లేడ్లు మరచిపోయాను. ప్రొద్దుటే అక్షింతలు తినాలి."

"నువ్వు అమరుస్తున్నావు కనుకనే చిందులు తొక్కుతున్నాడు."

అరవింద మాట్లాడలేదు. అన్నపూర్ణ అన్నది యదార్థమే. తను ఎదుర్కొంటున్న జీవితం, దాని సమస్యలూ అన్నపూర్ణకి తెలియనివా?

ఏంచేయాలి తాను? భర్తని మార్చాలా? లేక తనే ప్రశాంతితో రాజీపడాలా?

ఆటో ఆగింది. అన్నపూర్ణ ఎదురుగా వున్న డాబాలోకి వెళ్ళిపోయింది. వాళ్లిద్దరిదీ బాల్యస్నేహం. ఇద్దరి మధ్య మంచి అవగాహన వుంది. ఒకేరకం జీవితం కనుక మరింత సన్నిహితులయ్యారు.

అరవింద లోపలికి వస్తూంటే అమల ఏడుపు గట్టిగా వినిపిస్తోంది. తల్లిని చూడగానే యింకా రాగం పెంచింది. అంజన తాపీగా స్కూల్‌వర్క్ చేసుకుంటోంది.

"ఏమే.... .... అదలా ఏడుస్తూంటే రాయిలా కూర్చుంటావా?" పెద్దకూతుర్ని కోప్పడింది.

"నేనేం చెయ్యనమ్మా.... టీకి పాలు లేవు. విరిగిపోయాయి. హార్లిక్స్ యిస్తానంటే వద్దని ఏడుపు మొదలుపెట్టింది..."

"నన్ను కొట్టలేదూ...."

పొద్దుటనుంచీ పనివల్ల అరవిందకి విసుగ్గావుంది. సాయంత్రం తను వచ్చే సరికి రోజూ ఏదో పోట్లాటే.... పన్నెండేళ్లన్నా అంజనకి జ్ఞానంరాలేదు.

తండ్రికి వచ్చిందా దానికి రావడానికి? ఏనాడూ పిల్లలేంచేస్తున్నారన్న విషయం ఆయనకి తట్టలేదు అన్నీ తనే చూసుకోవాలి 'ఆఫీసు-పేకాట' అదే ఆయన ప్రపంచం ఇల్లు ...ఇల్లాలు... పిల్లలు .. ఆయనకి గుర్తురావు

అమలని బుజ్జగించడానికి అంజనని నాలుగు తిట్టింది. దాంతో అమల ఏడుపు తగ్గింది. స్వీట్లు యిద్దరికీ యిచ్చి వంటకి లేచింది.

తొమ్మిదింటికి పిల్లలు తిని పడుకున్నారు.

అవధాని రాలేదు. పదయినా.... అరవింద భోంచేసి లైబ్రరీ పుస్తకాలు తిరగేస్తూ వరండాలో కూర్చుంది.

చుట్టుప్రక్కల సద్దుమణిగింది.

మొదటి తారీఖున ఈ నిరీక్షణ తనకి అలవాటే. అయిదింటికి వచ్చేస్తాను అరూ" ప్రొద్దుట నమ్మకంగా చెబుతాడు.

వాగ్దానం నిలబెట్టుకున్న దెప్పుడు? ఏ అర్ధరాత్రో యింటికి చేరడం? పేకాట, విస్కీ-పార్టీలు మానమని తను ప్రాధేయ పడింది. తను ఏడవడం మిగిలింది కాని భర్త అలవాటు మానెయ్యలేదు.

ఒంటిగంట ప్రాంతంలో అవధాని తలుపుకొట్టాడు. అరవిందకింకా ఆలోచనలతో నిద్రపట్టలేదు. లైటువేసి తలుపు తీసింది.

అవధాని పెద్దఅంగలతో లోపలికివచ్చి మంచంమీద వాలిపోయాడు

భోజనం ప్రసక్తి అనవసరమని అరవింద విశితంగా చూస్తూ మంచంమీద కూర్చుంది. భర్త వాలకం చూస్తుంటే సెగలూ పొగలూ వస్తోంది.

"అన్నమాట ప్రకారమే వచ్చేశారే?" భర్తని తట్టి అడిగింది.

అవధాని మత్తుగా మూల్గాడు. అరవింద చేతులని గుండెలకత్తుకున్నాడు. 'బాగుంది సరసం' అరవింద విదిలించింది.

"కమాన్ ....డార్...లింగ్" అవధాని ఆమెకేసి తిరిగి పడుకున్నాడు.


లైటు వెలుగుకి అమల లేచి కూర్చుంది.

"పడుకోవే ." అరవిందవెళ్ళి ఆమెని నిద్రపుచ్చి వచ్చేసరికి భర్త నిద్రలోకి జారిపోయాడు. అరవింద హతాశురాలైంది.

అవధాన్ని నాలుగూ అడుగుదా మనుకుంది.

అరవింద భర్తజేబులు వెతికింది. సిగరెట్ పెట్టె, లైటర్, వక్కపొడి కాగితాలు, బస్‌పాస్ తీసి పరుపుతీసింది. ఎనిమిది రూపాయలున్నాయి.

అరవింద వణికిపోయింది. ఏడు వందలకి మిగులుత యివా? లేపి నాలుగూ




అడుగుదామనుకుంది. అర్ధరాత్రి తను గోలపెట్టడమేకాని ఏం ప్రయోజనం?

ఆలోచనలతో ఆ రాత్రి తిన్నగా నిద్రపట్టలేదు.

"లేవ్వే అమ్మా" ఆరున్నరయినా తల్లి లేవకపోవడంతో అంజన లేపింది.

"అప్పుడే తెల్లారిందా?" బద్ధకంగా లేచింది అరవింద.

పిల్లల్నిద్దర్నీ స్కూలుకి పంపేసరికి ఏనిమిదయింది. అరవింద స్నానంచేసి వంటప్రయత్నంలో వుండగా అవధాని లేచాడు.

అరవింద మాటలాడలేదు. కాఫీ తయారుచేసి వుంచింది. అవధాని ముఖం కడుక్కుని గుమ్మంమీద కూర్చున్నాడు.

అరవింద తను కాఫీ త్రాగసాగింది.

"నాకు లేదా రాణీ?"

"కాఫీకంటే విస్కీ బాగుంటుందికదా?"

"భలే దెబ్బ కొట్టావు."

అరవింద కాఫీ యిచ్చింది

"ఏం వండుతున్నావ్?"

"... ... ... ... ..."

"నీకు కోపం వచ్చినట్లుందే?"

"వస్తే యేం వుపయోగం?"

"సమ్మెచేస్తావు" పెద్దగా నవ్వాడు. అలా ఎందుకు నవ్వాలో అరవిందకి తెలియలేదు. బియ్యం తేడానికి పక్క గదిలోకి వెళ్లింది.

"అమ్మడూ నా సిగరెట్ పెట్టెకూడా పట్టుకురా?"

అవధాని సిగరెట్ కాలుస్తూ అక్కడే కూర్చున్నాడు.

ఎలా క్రాప్ చెయ్యాలా అరవింద ఆలోచిస్తోంది? ప్రతి నెలలాగే ఈ నెల జరిగిందేమోనని భయంగావుంది ఆమెకి. ఇలాగయితే సంసారం ఎన్నాళ్లు నిలబడు

తుంది? ఈయన కంటె చిన్న జీతగాడు మరిది హౌసింగ్ బోర్డ్ ద్వారా యిల్లు కట్టాడు. నెలకి పన్నెండు వందలు వస్తున్నా తమకి దరిద్రమే.

"జీతం యిచ్చారా?" అరవింద మామూలుగానే అడిగింది.

"నీకు యిస్తానని ప్రామిస్ చేశాను కదా, మా బిల్లు యింకా తయారవలేదు."

భర్తకేసి సూటిగా చూసింది. "నిజం?"

"నీకంతా అనుమానమే."

"కాదు, భయం"

"ఆ మాత్రం నమ్మకం లేకపోతే ఎలా?

"మరి రాత్రి అంత లేటయిందే?"

"కామేశం క్రాస్‌వర్డ్ పజిల్లో నెగ్గాడు. పార్టీ యిచ్చాడు."

అరవిందకి నమ్మాలని వుంది నమ్మలేనట్లుంది. ఎటూ వితర్కించుకోలేకపోయింది తను అదృష్టవంతురాలే అలా జరక్కపోతే అన్నయ్య కూతురి పెళ్లికివెళ్లచ్చు. పిల్లలతో అంత దూరం వెళ్ళిరావడం ఖర్చుతోపనే. అయినా తప్పదు అన్నయ్య మరీమరీ రాస్తున్నాడు.

"మీ అలవాట్లు, పార్టీలు నెమ్మదిగా మార్చుకోండి. మనకి సంసారం పెరుగుతోంది."

"మళ్లీ ఏదయినా?"

"చాల్లెండి" అరవింద సిగ్గుతో నవ్వింది "ఈ యిద్దర్నీ ప్రయోజకుల్ని చేస్తే చాలు."

ఈ విషయంలో కూడా అరవిందే చొరవ తీసుకుంది. అమల పుట్టగానే ఆపరేషను చేయించుకుంది అవధానికి మగబిడ్డ ఆశవుంది.

"ఈసారి ఆడపిల్లే పుడితే?" భర్తని అడిగింది.

ఏవో పాతనమ్మకాలతో సంసారం పెంచుకోవడం ఆమెకి నచ్చలేదు. మారుతున్న విలువలకి ప్రాధాన్యం యివ్వడం ముందుచూపున్నవారు చేస్తారు. సుఖపడతారు.

కొన్నాళ్లు మౌనంగా వున్నా అవధాని ఆమెని అర్థంచేసుకున్నాడు.

"ధరలు పెరుగుతున్నాయి. మన అవసరాలు పెరుగుతున్నాయి. ఆదాయం మాత్రం పెరగటంలేదు. అలాంటప్పుడు ........"

"ఆర్థికమంత్రిలా ఉపన్యాసాలు చెప్పకు బాబూ."

"నావి ఉపన్యాసాలు ... మీవి పరదాలు.... అవునా? మీరు జాగ్రత్త వుంచే ఈపాటికి యిల్లయినా కడుదుం"

"భయపడకు....త్వరలో శంకుస్థాపన చేద్దాం. ఇల్లుకట్టడం బ్రహ్మవిద్య కాదు."

"ఇప్పటిదాకా చెయ్యలేని వాళ్ళం, ముందరేమి చేస్తాం? ఇంటిలో పిల్లలు పెళ్ళికెదుగుతారు."

"అలా ఆడపిల్లల్ని కన్నందుకు సిగ్గుపడాలి నువ్వు?"

"నాతో మీరూ?"

జీతం క్లబ్బులో తగలెయ్యనందుకు అరవిందకి సంతోషంగానే వుంది.

ఆ సాయంత్రం అరవింద వచ్చే సరికి అవధాని ఇంటిదగ్గర వున్నాడు.

ఇదేదో ప్రళయమే అనుకుంది అరవింద.

టీ పెడుతూండగా అవధాని లోపలికి వచ్చి ఏడువందలు భార్యకిచ్చాడు. అరవింద కళ్ళలో వెలుగు. డబ్బుకన్న భర్త మంచిదారిని పడుతున్నాడన్న ఆనందం ఎక్కువగా ఉంది.

"మీరు గుడ్‌బాయ్‌గానే వుండండి."

"చాల ఆశ వుందే!"

మర్నాడునుంచి అరవింద పెళ్ళి ప్రయాణంలో వుంది. పుట్టింటికి వెళ్ళి నాలుగేళ్లు అవుతోంది. యిలా 'ఛేంజి' రావడం, పిల్లలకి సెలవులు రావడం కలిసివచ్చాయి.

అవధాని వచ్చి 'గోదావరి' ఎక్కించాడు.

పెళ్ళి పూర్తయింది. నలుగురూ వెళ్ళిపోయారు. అరవింద కూడా ప్రయాణంలో వుంది. సెలవున్నది కదాని సీతారామారావు ఆగమన్నాడు.

"మా మరదలకి బంగారమంటే యిష్టం పోయిందా? రోల్డుగోల్డు పెడుతోంది." ఓ సాయంత్రం పెరట్లో కూర్చున్నప్పుడు వదినగారు హాస్యంచేసింది.

అరవింద పులిక్కిపడింది. "వెయ్యి రూపాయిల నెక్లసు యిది."

"కంసాలికి చూపించు."

వెంటనే అంజనచేత వీరాచారి దగ్గరకి పంపించింది. అంజన వెంటనే వచ్చింది.

"ఇత్తడిదటమ్మా...."

అరవిందకి కళ్ళు తిరిగాయి. శిఖరం నుంచి లోయలోకి పడిపోయింది. భర్త మీద పెంచుకున్న నమ్మకం, గౌరవం కరిగిపోయాయి.

వెంటనే ప్రయాణమైంది.

"ఏమ్మా .... నాలుగురోజు లుంటానన్నావుగా" అర్ధాంతరంగా ప్రయాణమవడం సీతారామారావుకి అర్థంకాలేదు.

"పనుందన్నయ్యా.... మళ్ళీ వస్తా."

జరిగింది అరవింద వూహించగల్గింది. ఇది భర్త పనే. నెక్లసు అమ్మి డబ్బు పట్టుకువచ్చి వుంటారు. తెలియకుండా డూప్లికేట్ పెట్టారు.

'ఛీ .... యిలాంటి దగాకోరుని ఎక్కడా చూడం.' రైల్లో కూర్చున్న ఆమె ప్రాణం వుడికిపోతోంది.

"నా మాటలకి కోపం వచ్చి వెళ్ళిపోతున్నావా?" వదినగారు బయలు దేరుతుంటే యిదయింది.

జరిగింది వదినతో ఏం చెబుతుంది? లోకువ కాదూ?

ఇంటికి రాగానే భర్తమీద చండికలా పడింది.

"నన్ను క్షమించు అరవిందా!"

అంతకుమించి మాట్లాడలేదు అవధాని.

* * *

అరవింద జీవచ్ఛవంలా తయారైంది. ఏదో యంత్రంలా ఆఫీసుకు వెళ్ళి వస్తోంది. తప్పనిసరిగా యింటి పనులు చేస్తోంది.

అవధానితో మాట్లాడడానికే సిగ్గు వేస్తోంది. ఓ వారం పోయాక అవధాని భార్యని పల్కరించాడు. అరవింద మాట్లాడలేదు.

అవధాని ఖిన్నుడయ్యాడు. అరవింద తనని సాధించడం కోపంగానూ, అవమానంగానూ వుంది. భార్యముందు విధేయతగా నిలబడటం, తప్పుపట్టుబడటం అతడికి మనస్తాపంగానే వుంది. పలు రకాల భార్యని బ్రతిమిలాడు. వాగ్దానాలు చేశాడు.

అవన్నీ నీటి మూటలుగా కనిపించాయి అరవిందకి.

"ఇలా జావకారిపోతే ఎలాగే?" అన్నపూర్ణ ఓ రోజున నిలవేసింది.

మానసిక ఆందోళనతో దేహిక ఆరోగ్యం చెడింది. అరవింద చాలా చిక్కిపోయింది నీరసంగా కనిపిస్తోంది. మందులు మింగుతోంది.

"ఏం చెయ్యను....ఆయన్ని మార్చే శక్తి నాకు లేదు."

"అలా నిరాశపడితే ఎలా? దీక్షగా చేస్తే నీ కృషి ఫలించకపోదు."

"నాకు నమ్మకం లేదు."

"ఈ సారి ప్రయత్నించు. విజయం నీదే."

అరవింద ఆశగా చూసింది.

"నువ్వు వుద్యోగం ఓ సంవత్సరం సెలవుపెట్టు. రిటిచ్‌మెంటులో తీసేశారని చెప్పు. సంసారం తనమీద ఆధారడితే ఆ మనిషికి తెలియకపోదు."

అరవిందకి నచ్చింది. కాని అనుమానం కమ్మింది. అది గాలిలో పెట్టే దీపంలాగుంటే?

"నీ యిష్టమొచ్చినట్టు వ్యాచర్ని ఫోర్‌కాస్ట్ చెయ్యకు. శంకిస్తే ఏపనీచెయ్యలేం."

"బెస్ట్ అఫ్ లక్."

* * *

అవధాని జీతాన్ని తీసుకుని బయటకి వచ్చాడు. దిలీప్ గారెజీనుంచి స్కూటర్ తీసి అప్పటికే స్టార్టుచేసి, "రా గురూ యిప్పటికే లేటయిపోయింది. టేబిల్ దొరకదు ఆలస్యం చేస్తే" అన్నాడు.

అవధాని సందిగ్ధంగా నిలబడిపోయాడు. కోరికలు ముందుకు వెళ్ళమంటున్నాయి. అనుభవం ఆగమంటోంది. ఆలోచించమంటోంది. ఈ సంఘర్షణ వుదయాన్నుంచీ సీడిస్తోంది.

ఇదివరకులా తను వేషాలు వెయ్యడం కుదరదు. జీతం క్లబ్బులో రమ్మీ ఆడేసి బార్‌లో త్రాగేసి యింటికి వెళ్ళడం కుదరదు. సంసారం తనమీదే వుంది.

అరవింద వుద్యోగం లేక కూర్చున్నది.

ఇన్నాళ్ళు తనకీ బాధ లేదు. సంసారాన్ని అరవింద చూస్తుందన్న ధీమా

వుండేది. ఇప్పుడు అరవిందేం చెయ్య గలదు? ఒకవేళ మామూలుగా యింటి కెళితే.... నెలంతా నరకం.

"రా గురూ! ఆగిపోయావేమిటి?"

అవధాని సిగరెట్ వెలిగించాడు. ఆలోచనలతో తల పగిలిపోతోంది. ఆటా? ఇటా? 'రాను' అని చెప్పడానికి నాలుక రాలేదు. తన అదృష్టం బాగుంది యివాళ రైజ్ పడకూడదూ? వద్దంటే అయిదారు వేలు వస్తాయి. క్రితంసారి జమదగ్నికి రాలేదు?

దిలీప్ హారన్ కొట్టాడు.

అవధాని ఎగిరివెళ్ళి వెనక ఎక్కాడు. చివరికి కోరికే జయించింది. అతడి కళ్ళ ముందు ఈ దశలో భవితవ్యం లేదు. వర్తమానమే వుంది. అదయినా పేక ముక్కలే కనిపిస్తున్నాయి.

రక రకాల జూదాలతో మనుషులతో క్లబ్ రద్దీగా వుంది.

అవధాని లోపల కెళ్ళబోతుండగా మంగపతి పరుగెత్తుకువచ్చాడు. "ఇక్కడ వుంటావని వూహించాను, అలాగే దొరికావు" అన్నాడు వగరుస్తూ.

"ఏం కొంప మునిగింది?" అవధానికి విసుగ్గా వుంది.

"అప్పారావు ఆత్మహత్య చేసుకున్నాడు"

అవధాని ప్రూన్పడిపోయాడు.

"వాడి వూరునుంచి న లు గు రూ రావడానికి ఆలస్యమవుతుంది. వాడి పెళ్ళాం మిగతావన్నీ చూడమని చెప్పింది. నేను నీ కోసం పరుగెత్తుకుని వచ్చాను."

అవధాని బయటకి వచ్చాడు దిలీప్ కేకవేస్తున్నా వినలేదు. విచారంతో అతడి ముఖం తడిసిపోయింది. మంగ పతితో రిక్షా ఎక్కాడు.

"హాయిగా బ్రతకక్క చావడ మెందుకురా? సంసారాన్ని ఏంచేద్దామని? ఇప్పుడంత చచ్చే సమస్య ఏమొచ్చింది వాడికి?"

"మనవాడి సంగతి నీకు తెల్సుకదా! డబ్బంతా గుర్రప్పందాలకి ఖర్చు పెట్టే స్తాడు. దీవిత్తై భార్య ఏదో అందిట. దాంతో మనవాడు...."

"చెప్పకు.... ప్లీజ్." అవధాని తల పట్టుకున్నాడు.

అదే కథని తనకి అన్వయించు కున్నాడు. బంగారం లాంటి జీవితం జూదానికి బలయిపోతోంది. సంసారం పతనమైపోతోంది. ఏమిటి చివరకి మిగిలేది?

"ఏమిట్రా అలా అప్సెట్ అయి పోయావు.... తేరుకో. ముందర పనంతా మనమే చూడాలి."

అప్పారావు యిల్లు ఏడ్పులతో దద్దరిల్లి పోతోంది. చుట్టుపక్కల వారు గుమిగూడి సానుభూతి, వ్యాఖ్యానాలు చేస్తున్నారు.

శ్మశానం నుంచి తిరిగొచ్చేసరికి రెండ యింది. అప్పారావు భార్యకి మిగిలిన

డబ్బు యిచ్చేసి ధైర్యంచెప్పి యింటికి బయలుదేరాడు.

గదిలో దీపం వెలుగుతోంది. తలుపులు దగ్గరగా వేసివున్నాయి. పిలవకుండానే తెరుచుకున్నాయి. అవధాని నీర్సంగా కూలబడ్డాడు.

అరవిందకి కోపం ఆగడం లేదు. యధాప్రకారంగా జీతం తగలేసి వచ్చారు. తను చెప్పినవన్నీ గాలికి పోయాయి. నెలంతా ఏం చెయ్యాలి.

"ఇల్లు గుర్తువచ్చిందన్న మాట"

"..............."

"అవున్లెండి. డబ్బులయిపోయాక అక్కడ ఎవరుండనిస్తారు?"

"ఏమిటి అర్థంలేని వాగుడు."

"నాది వాగుడు, మీది పనులు. ఎన్ని జన్మలయినా మీరు మారరు. మారరు. ఇక మా బ్రతుకులింతే. పెళ్ళాంపిల్లలుకంటె పేకాటే ముఖ్యమయినపుడు పెళ్ళెందుకు చేసుకోవాలి? మీతోపాటు ఏడ్వడానికా?" అరవింద కోపం ద్విగిణీకృతమైంది.

అంజన, అమల ఈ గొడవకి లేచారు.

ఏం తెల్సుకోకుండా మాట్లాడుతుందేమిటి యిడియట్? అవధాని విసురుగా లేచాడు అరవిందని పట్టుకుని తన్నాలని పిస్తోంది. పిల్లలు లేవడంతో బలవంతంగా కోపాన్ని నిగ్రహించుకున్నాడు.

"నోర్మూసుకుని పడుకో."

"నేను మూసుకున్నందుకేగా యిలా తయారయ్యారు?"

అవధాని బట్టలు మార్చుకోకుండా మంచం ఎక్కాడు. అరవింద మాట్లాడుతున్నా సమాధానం చెప్పలేదు. అప్పారావు అంతిమయాత్ర కళ్ళకి కట్టినట్లు కన్పిస్తోంది. ఎప్పటికో నిద్రపట్టింది. ఆరున్నరకి మెలకువ వచ్చింది. అంజన గది తుడుస్తోంది.

అవధాని జీతం తీసి "ఇది మీ అమ్మకియ్యి అంజనా" యిచ్చి లుంగీ చుట్టుకుని బ్రష్ అందుకున్నాడు.


యధాతథంగా జీతం యివ్వడం అరవిందకి ఆశ్చర్యంగానే వుంది. పేకాటకి వెళ్ళలేదా? మరి అంత రాత్రిదాకా ఏంచేస్తున్నట్లు?"

అవధాని స్నానం చేసి బట్టలు వేసుకున్నాడు.

"ఈ కాఫీ మీ నాన్నగారి కిచ్చిరా?" అంజనకి పురమాయించింది.

ఈ 'తెర' బాగోతాలు నాలుగు రోజులు నడిచాయి. ఒకర్ని ఒకరు చూసుకోడానికి, మాట్లాడుకోడానికి సందేహించుకున్నారు. చివరికి అరవిందే చొరవచేసి మాట కలిపింది. భర్తని అపార్థం చేసుకున్నందుకు ఆమె చింతించింది.

ఈ నెల అప్పారావు చావులో గండం గడిచింది. వచ్చే నెల? అరవింద ఆలోచనలు వచ్చే నెలమీద వున్నాయి.



ఓ ఆదివారం అన్నపూర్ణ వచ్చింది. అరవింద పిల్లలకోసం చేగోడీలు తయారుచేస్తోంది. "రావే దగ్గరగా వుండే దూరమైపోయావు."

"ఇంచక్కా అన్నీ చేసుకుని తింటున్నావు మా అన్నయ్య పేరుమీద."

అంజన, అమల టిఫిన్ చేసి సినిమాకి వెళ్ళిపోయారు. ఇద్దరూ చేగోడీలు తింటూ హాల్లో కూర్చున్నారు. "ఏమంటున్నాడు మా అన్నయ్య? ఎలా వుంది ప్రోగ్రెస్?"

"అప్పుడే ఏం చెప్పను? ఇప్పటిదాకా బాగానే వుంది. ఏదో మొక్కుబడిగా యింటికి వస్తున్నారు. కాని, నాతో ఏం మాట్లాడటం లేదు. తరచి అడిగినా విసుక్కోవడం తప్ప సమాధానం లేదు."

"మరి క్లబ్‌కి వెళ్ళడం లేదా?"

"లేదనే మంగపతి చెబుతున్నాడు."

"అది నిజమే. అవధాని లేని క్లబ్బు వెలవెలపోతోందని అతడి ఫ్రెండ్స్ గోలపెడుతున్నారట."

జీతం రాగానే అవధాని భార్యకి తేకేసి యిచ్చాడు.

"నా దగ్గర ఎందుకు? మీరే ఖర్చు చేయండి."

"అంత నమ్మకం వుందా నీకు?"

"అలా హెచ్చరించాననే కదా మీకు కోపం. మాట్లాడకుండా మానివేశారు."

అవధాని డబ్బు పడేసి లేచి నిలబడ్డాడు.

"ఎక్కడికి అర్జంటుగా వెళ్లిపోతున్నారు? టిఫిన్ చేశాను ఆగండి."

"నాకేం వద్దు."

"మీ సంపాదనే కాని మీ క్షేమం మాకు అక్కర్లేదా? లేక డబ్బిచ్చి చెయ్యి దులిపేసుకుని పోటానికి యిది హోటలా?"

అవధాని కింకా భార్యమీద కోపం పోలేదు. భార్య తనని కంట్రోల్ చెయ్యటానికి ప్రయత్నించడం అతడికి కష్టంగానే వుంది.

అరవింద అతడి కిష్టమైన స్వీటు ప్లేటులో పెట్టి యిచ్చింది.

"ఎలా వుంది హల్వా?" అరవింద దగ్గిర కూర్చుని అడిగింది.

"నీ ముఖంలా వుంది."

"మునుపు నా ముఖం బాగుందనేవారు కదా"

"ఇప్పుడు కాదు."

ఇంతలో అంజన, అమల స్కూలు నుంచి వచ్చారు. అమల సర్కస్ మాట తల్లికి గుర్తుచేసింది అరవిందకీ వెళ్లాలనే వుంది, భర్తతో ఎక్కడికయినా వెళ్లి చాలరోజులైంది.

"ఏమండీ వెళదామా?"

"నేనెందుకు? మీరు వెళ్లండి."

"పిల్లలు సంబరపడుతున్నారు.... ప్లీజ్ రండి."

అవధాని అంగీకరించాడు.

నాలుగైదు నెలలు గడిచాయి. అవధానిలో మార్పు అరవింద గ్రహించింది కాని యిది తాత్కాలికం.... అని భయం పట్టుకుంది.

ఇంతలో సీతారామారావు అయిదు వందలకి పోలంకిస్తు డ్రాఫ్టు పంపాడు. అరవింద ఆలోచించి భర్త కిచ్చింది.


"నా కెందుకు?"

"ఈ మధ్య మీకు పార్టీలు లేవుగా. అందుకే పరధ్యానంగా కనిపిస్తున్నారు. ఈ డబ్బు పోయినా ఫర్వాలేదు. ఎంజాయ్ చెయ్యండి."

"ఛీ.... ఆ పేరు చెప్పకు."

"ఏం.... పెళ్ళాం డబ్బుతో పార్టీ చేసుకోకూడదా?"

"ఏదీ కూడదనే మానివేస్త. మళ్లా ఆ రొంపిలో దిగితే బయటకిరావడం




కష్టం. పాత అలవాట్లకి స్వస్తి చెప్పాను."

అరవిందకి ఏనుగుని ఎక్కినట్లుంది.

భవిష్యత్తు తీయగా పలకరిస్తోంది. తన జీతం బాంక్ చేస్తే అయిదేళ్ళలో యిల్లు కట్టుకోవచ్చు. తన కోరిక ఫలించబోతోంది.

ఇక తను వుద్యోగంచేసినా పర్వాలేదు. భర్త మారిపోడు. సెలవు కాన్సిల్ చేసుకుని అరవింద వుద్యోగంలో చేరింది

"ఇదంతా నీ చలవే" అంది రీసెస్‌లో అన్నపూర్ణతో....

"నీ మొగుడి చలువ. మొత్తానికి సాధించావు."

అవధాని ఆఫీసు నుంచి వచ్చేసరికి అరవింద యింటి దగ్గర కనిపించలేదు. అంజన ఆఫీసు కెళ్ళిందని చెప్పింది.

ఇంతలో అరవింద వచ్చింది.

"ఉద్యోగం ఎలా వచ్చింది?" అవధాని అడిగాడు.

అరవింద కాఫీ పెడుతూ జరిగినదంతా చెప్పింది. అవధాని హావభావాలు ఎలా వుంటాయోనని పరీక్షగా చూడసాగింది.

"అమ్మదొంగా.... ఎంత నాటకమాడావ్" వంగి ఆమెని దగ్గరికి తీసుకోబోయాడు.

"ష్.... పిల్లలు" అరవింద తప్పుకుంది.